RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | మంగళవారం | 06 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 262 | పేజీలు : 4 | వెల : 5/-

## విపక్షాల తీరు విచిత్రం

- ప్రధాని నరేంద్ర మోదీ ఘాటు విమర్శలు
- ప్రతిపక్షాల్లో పోటీతత్వమే లేదని ఎద్దేవా
- కాంగ్రెస్ దుకాణానికి తాళమేనని జోస్యం
- పార్లమెంట్ బడ్జెట్ ప్రసంగం ప్రధాని భాష్యం



బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రసంగించారు. విపక్షాల చర్యలు విచిత్రంగా ఉన్నాయని, సుదీర్ఘ కాలం విపక్షంలోనే ఉండాలని ఆ పార్టీలు భావిస్తున్నాయని విమర్శించారు.. ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యాన్ని కోల్పోయారని పేర్కొన్నారు.

4లో



# ప్రజల నినాదమై..

- నీళ్ల పోరాటానికి సిద్ధమవుతున్న గులాబీ దండు
- నల్లగొండ నుంచి సమరానికి సన్నద్ధమవుతన్న బీఆర్ఎస్
- బహిరంగ సభ వేదిక నుంచి కేసీఆర్ పిలుపునిచ్చే అవకాశం
- కాంగ్రెస్‌పై కదనరంగానికి కసరత్తు చేస్తున్న కారు పార్టీ

నల్లగొండ, ప్రభాతసూర్యుడు : కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ బీఆర్ఎస్ యుద్ధానికి సిద్ధమవుతోంది. ప్రధానంగా కృష్ణా జలాల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ కార్యాచరణ రూపొందిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కృష్ణా జలాల అంశాన్ని ప్రచారాస్త్రంగా మలుచుకునేందుకు బీఆర్ఎస్ వ్యూహం రచిస్తోంది. కృష్ణా జలాల్లో వాటా తేల్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చలో నల్లగొండకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది.కృష్ణా జలాలతో అత్యధిక లబ్ధి పొందుతున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంగా బీఆర్ఎస్.. రేవంత్ సర్కార్ పై పోరాటానికి సిద్ధమవుతోంది. ఛలో నల్లగొండ పేరుతో ఈనెలలో భారీ బహిరంగ సభకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. లక్ష మందితో నల్లగొండలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని ఆ పార్టీ భావిస్తోంది. నల్లగొండ భారీ బహిరంగ సభ తర్వాత పార్టీ నేతలు నాగార్జున సాగర్ వరకు పాదయాత్ర నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు అధిష్టానం సమాచారం అందించింది.కృష్ణా జలాలకు సంబంధించి సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకోవడం, అంతకుముందు ఆంధ్రా అధికారులు అనుమతి లేకుండా నీటిని విడుదల చేసుకోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కృష్ణా జలాల విషయంలో రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీనేలా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కేఆర్ఎంబీకి కృష్ణా నదిపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను అప్పగించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుబట్టింది. కృష్ణా జలాల అంశాన్ని బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా మలుచుకోనుంది. తెలంగాణ వాటా తేల్చకుండానే ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం ఏంటని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన

మిగతా 2వ పేజీలో...

## కేసీఆర్‌పై సీబీఐ





హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : భారత రాష్ట్ర సమితి అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై ఎట్టకేలకు ప్రజాప్రయోజన వ్యాజ్యం హైకోర్టులో దాఖలైంది. మేడిగడ్డ కుంగుబాటుపై సీబీఐ విచారణ జరిపించాలని

మిగతా 3వ పేజీలో...



# రేషన్‌కార్డు గ్యారంటీ!

- కాంగ్రెస్ పథకాలకు కార్డు కంపల్సరీ
- ఆ రెండు స్కీముల వర్తింపునకు తప్పనిసరి
- హామీల అమలులో సర్కారు తాజా నిర్ణయం
- త్వరలో విధివిధానాలు వెల్లడించనున్న ప్రభుత్వం




హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఒకటైన 200 ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అధికారులు కూడా ఉచిత విద్యుత్ అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌కు చెందిన బృందం శనివారం బెంగళూరు వెళ్లింది. బెంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని సందర్శించింది. గృహ జ్యోతి పథకం అమలును అర్థం చేసుకోవడానికి తెలంగాణ అధికారులు బెస్కామ్ కార్యాలయాన్ని సందర్శించారు.తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారి ముషారఫ్ ఫరూఖీ నేతృత్వంలో బృందం కర్ణాటకకు వెళ్లింది. తెలంగాణ రాష్ట్రంలో ఇదే విధమైన ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడానికి గృహ జ్యోతి పథకం గురించి ఇన్‌పుట్‌లు తీసుకోవడానికి బెంగళూరు వెళ్లారు. వారు బెస్కామ్ ఎండి మహతేష్ బిలాగి, డైరెక్టర్ ఫైనాన్స్ ధర్షన్ జె, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రెవెన్యూ సెక్షన్ అధికారులతో చర్చలు జరిపారు.గృహ జ్యోతి పథకం కింద, కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నివాస గృహాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను

మిగతా 2వ పేజీలో...

## కలిసిరానున్న కొలువులు!

- గ్రూప్ -1 పోస్టులు పెంపునకు సర్కారు యోచన
- అదనంగా 70 ఖాళీలను కలిపేందుకు కసరత్తు

4లో






## ఖానాపూర్‌లో 'కారు' బ్రేక్‌డౌన్!

- మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం
- రాజేందర్ చైర్మన్ పదవి గల్లంతు
- బల్దియా పీఠం కాంగ్రెస్ వశం?

3లో




## పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో ఓటర్లను ఆకట్టుకునేందుకు 3 ప్రధాన రాజకీయ పార్టీలు ఒక్కో వ్యూహం అనుసరిస్తున్నాయి. బీజేపీ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యమని చెబుతుంటే రాహుల్‌ను ప్రధానిని చేయాలని కాంగ్రెస్ పిలుపునిస్తోంది. తాముంటేనే తెలంగాణకు నిజమైన అస్తిత్వముంటుందని బీఆర్ఎస్ వాదిస్తోంది. లోక్‌సభ ఎన్నికల గడువు సమీపిస్తున్న తరుణంలో తెలంగాణలోని పార్టీలు తమ ఎత్తుగడలతో ప్రత్యర్థి పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విరుచుకుపడుతున్న టీబీజేపీ రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు నెగ్గి కేంద్రంలో ముచ్చటగా మూడో సారి అధికారంలోకి వస్తామని చెబుతోంది. 2047 నాటికి దేశంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామంటోంది. మోదీ నాయకత్వంలో భారత్ విశ్వగురు అవతరించే తరుణమిదేనని కమలనాథులంటున్నారు. తెలంగాణలో ప్రజాపాలన

మిగతా 2వ పేజీలో...

## విశాఖ టెస్ట్‌లో భారత్ విజయం

- రెండో టెస్ట్‌లో రాణించిన టీమిండియా బౌలర్లు
- ఫలించని క్రాలే ఒంటరి పోరాటం
- 106 పరుగుల తేడాతో ఇంగ్లాండుపై గెలుపు
- చెరో 3 వికెట్లతో సత్తా చాటిన అశ్విన్, బుమ్రా

3లో

వైజాగ్‌టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 292 పరుగులకు ఆలౌట్ చేసి 106 పరుగుల తేడాతో గెలుపొందింది.






## హాస్టల్లో అసలేం జరిగింది?


- భువనగిరిలో బాలికల ఆత్మహత్యపై పలు సందేహాలు
- హత్య చేశారని అమ్మాయిల తల్లిదండ్రుల ఆరోపణలు
- వార్డెన్ సహా ఆరుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

నల్లగొండ, ప్రభాతసూర్యుడు : భువనగిరి జిల్లా కేంద్రంలో హాస్టల్ వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల భవ్య (15), వైష్ణవి (15) ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాలపై గాయాలు, పంటిగాట్లు ఉన్నట్లు ఇరువురి బాలికల కుటుంబ సభ్యులు తెలిపారు. బాలికల హాస్టల్ లోకి వచ్చిన కొందరు ఆటో డ్రైవర్లు బాలికలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు తమకు తెలిసిందని వారు ఆరోపిస్తున్నారు. తమ పిల్లలను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని

మిగతా 3వ పేజీలో...


## రేవంత్ అబద్ధాల సీఎం

- ముఖ్యమంత్రిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- కేసీఆర్‌పై వ్యక్తిగత ధూషణలకు పాల్పడ్డారంటూ మండిపాటు



4లో

## లక్సెట్టిపేటలో బలం నిరూపించుకున్న గులాబీ




3లో

## మాకో టిక్కెట్ కావాలి..

గాంధీభవన్‌కు కాంగ్రెస్ నేతలు క్యూ



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మేడారంకు ఆర్టీసీ బస్సులు



**ములుగు, ప్రభాతసూర్యుడు :** ములుగు జిల్లా మేడారంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బందితో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పొన్నం ప్రభాకర్, సజ్జానార్ మాట్లాడుతూ ఈసారి జాతరకు 30 లక్షల మందిని తరలించడమే లక్ష్యంగా ఖీఅ సంస్థ సిద్దమైంది. రాష్ట్రవ్యాప్తంగా 51 ప్రాంతాల్లో ఆర్టీసీ సంస్థ పికపింగ్ పాయింట్స్ ఏర్పాటు చేసింది. 6 వేల బస్సులు, 15 వేల మంది సిబ్బందితో తీబిఇ సంస్థ విధులు నిర్వర్తించబోతున్నారు. పొరుగురాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, చత్తీస్గఢ్, ఒరిస్సా, మహారాష్ట్ర నుండి వచ్చే భక్తులను కూడా సురక్షితంగా మేడారం తరలించే ఏర్పాట్లుచేశామని అన్నారు. మహిళలు మహాలక్ష్మి పథకంను ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. జాతరకు భక్తులను తరలించడం లో ఆర్టీసి పాత్ర కీలకం. 16వ తేదీన మేడారంలో ఆర్టీసీ క్యాంపు ప్రారంభిస్తామని అన్నారు.



# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశం

**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, మండల ఆధికారులు, మున్సిపల్ అధికారులు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఖచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను, ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్ లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి వాటిలో ఎన్ని పరిష్కరించడం జరిగిందని, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయని తెలుస్తుందని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన సమస్యల పై సత్వరమే స్పందించి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. జిల్లా శాఖల వారీగా ప్రతి శాఖకు సోషల్ మీడియాలో ట్విటర్ అకౌంట్ ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన స్పెషల్ ఆఫీసర్లకు ఈ నెల 6వ తేదీన ఒక్క రోజు ఓరియేంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 నుండి 14 వరకు ప్రతి గ్రామంలో సానిటైజేషన్ డ్రైవ్ కొనసాగుతుందని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (158) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

### వ్యవసాయ కార్మిక సంఘం నేత పి.అంజయ్య

**యాచారం - ప్రభాత సూర్యుడు :** 16న జరిగే దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సోమవారం సింగారం అయ్యావారి గూడెం గ్రామాల్లో కరపత్రం ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు పి అంజయ్య మాట్లడుతూ గతంలో గ్యాస్ 350 రూపాయలు వుంటే ఇప్పుడు 1200 రూపాయలు పెంచి ప్రజల పైనా భారాలు మోపింది. పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం వలన నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగి పెద్ద ఎత్తున ప్రజలమీద భారం పడింది . కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు ప్రజల సంపదను కార్పోరేట్ శక్తులైన అంబాని అదానిలకు దోషిపెడ్తు ప్రజలను బికారులుగా చేస్తోంది బిజెపి ప్రభుత్వం. మరోపక్క ప్రభుత్వా రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తు కార్మికులకు ఉన్న హక్కులను కలారాస్తుంది . గతంలో ఇచ్చిన వాగ్దానాలను అమలుచే యకుండ. ఇవన్ని మరపించ్చి మళ్ళీ ఎన్నికలల్లో గెలువడం కోసం రాముని పేరుతో ఇల్లు ఇల్లు తిరిగి ప్రజలను మోసం చేస్తున్నారు . ఇంకా బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక మతోన్మాదా విధానాలకు వ్యతిరేకంగా 16 న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు ఎం.జంగయ్య, గోపాల్, క్రిష్ణ , వెంకటేశ్, శ్రీరాములు, జంగయ్య, శ్రీశైలు, తదితరులు పాల్గొన్నారు.



# మంచాల సిఐకి సన్మానం

- ఇన్‌స్పెక్టర్ బబ్యానాయక్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు
- సీఐని సన్మానించిన మాదగోని జంగయ్య, శ్రీనివాస్‌నాయక్

**మంచాల - ప్రభాత సూర్యుడు :** మంచాల మండలం పోలీస్ స్టేషన్ నూతన సీఐగా విధుల్లో చేరిన సీఐ బాబ్యా నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ ఎస్టి సెల్ మండలం నాయకుడు నేనావత్ శ్రీనివాస్ నాయక్. ఈ సందర్భంగా మాధగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ నూతనంగా విధుల్లో చేరిన మంచాల మండలం పోలీస్ స్టేషన్ సిఐ బాబ్యా నాయక్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచాల మండలంలో మంచి సీఐగా పేరు తెచ్చుకోవాలని అన్నారు. పోలీస్ అధికారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎల్లవేళలా సహాయంగా ఉంటూ పోలీస్ అధికారులతో కలిసిమెలిసి ఉంటామన్నారు . ఈ కార్యక్రమంలో సపావట్ పాండు నాయక్, జాటోత్ శ్రీనివాస్ నాయక్, జాటోత్ లచ్చి రామ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# నేటి బీఆర్ఎస్ మీటింగ్ వాయిదా



### మున్సిపల్ ప్రధాన కార్యదర్శి మడుపు వేణుగోపాలరావు

**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** నేడు జరగబోయే బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు వాయిదా పడిందని తదుపరి సమావేశ తేదీని త్వరలోనే ప్రకటిస్తారని అన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు

మొదటిపేజీ తరువాయి..

వచ్చినట్లే కేంద్రంలో రాహుల్‌ను ప్రధానిగా దేశవ్యాప్తంగా ప్రజాప్రభుత్వం రావాలని తెలంగాణ కాంగ్రెస్ కోరుకుంటోంది. ఇండియా కూటమిని గెలిపించుకోవడమే లక్ష్యంగా దూసుకెళ్తోన్న రేవంత్ బీఆర్ఎస్–బీజేపీలను తూర్పారపడుతున్నారు. తెలంగాణ సమస్యలను తాము మాత్రమే పార్లమెంట్‌లో లేవనెత్తగలమని బీఆర్ఎస్ అంటోంది. జాతీయ పార్టీలకు తెలంగాణ సమస్యలు పట్టవని గులాబీనేతలు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ గళం.. బలం తామేనంటూ గులాబీ పార్టీ రెడీ అవుతోంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తోంది. అయితే, మూడు ప్రధాన రాజకీయ పార్టీల్లో ఏ పార్టీ వాదానికి ప్రజలు మద్దతిస్తారో త్వ-రలోనే తేలనుంది.

# కలెక్టర్ పర్యవేక్షణలో వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

### వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ళ జంగయ్య



**యాచారం - ప్రభాత సూర్యుడు :** వికలాంగుల హక్కుల పోరాట సమితి రంగారెడ్డి జిల్లా కమిటీ దివ్యాంగులకు సదరం స్లాట్ వలన దివ్యాంగులకు ఇబ్బందులు జరుగుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు కాళ్ళ జంగయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మండలంలో సదరం క్యాంపును నిర్వహించాలని ఎంపీడీవోలకు పంచాయతీ సెక్రెటరీలకు అధికారాలు ఇవ్వాలని కోరారు. మంచానికే పరిమితమైన వికలాంగులకు సదరం సర్టిఫికేట్ కోసం మీసేవ చుట్టూ సదరం స్లాట్ కోసం ఇబ్బంది కలగకుండా ఇంటి దగ్గరికి వచ్చి డాక్టర్లు సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. అదేవిధంగా వికలాంగులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ పర్యవేక్షణలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు.

# మహిళను బెదిరించి దోపిడీ

**రాజన్న సిరిసిల్ల, ప్రభాతసూర్యుడు :** రాజన్న సిరిసిల్ల జిల్లా సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన ఓ మహిళను కత్తితో బెదిరించి, మూడు తులాల పుస్తెలతాడు, అద్ద తులం కమ్మలు ఎత్తుకెళ్లిన సంఘటన జిల్లాలో చోటుచేసుకుంది. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన సిద్ధవ్వ మహిళ గ్రామ శివారులోకి బహిర్భూమి కోసం వెళ్ళగా జన సంచారం లేని ప్రాంతంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు, సిద్ధవ్వను బెదిరించి, మెడపై కత్తి పెట్టి బంగారం వస్తువులు తీసి ఇవ్వాలని అనడంతో భయపడి ఆమె బంగారం వస్తువులను తీస్తున్న సమయంలో ఆమె మెడలో నుండి పుస్తెలతాడును తెంపుకొని పారిపోయారు. ఈ సంఘటనపై కోనరావుపేట పోలీసులు విచారిస్తున్నారు.

# ప్రజల నినాదమై..

మొదటిపేజీ తరువాయి..

చేత కాదనడానికి ఇదే ఉదాహరణ అని విమర్శించింది. రేవంత్ సర్కార్ ప్రాజెక్టులను ఢిల్లీ ప్రభుత్వ చేతుల్లో పెట్టిందని బీఆర్ఎస్ విరుచుకు పడుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని ఆరోపించింది. భవిష్యత్తులో ఏ ప్రాజెక్ట్ కట్టాలన్నా.. ప్రాజెక్ట్ నుంచి చుక్క నీరు తీసుకోవాలన్న వారి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని బీఆర్ఎస్ చెబుతోంది. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని ఆరోపించింది. గతంలోనే దీనిపై తాము ప్రభుత్వాన్ని హెచ్చరించామని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించబోమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అందుకు విరుద్ధంగా వ్యవహరించి తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతినేలా చేసిందని 2021లో నిర్ణయం తీసుకున్నా.. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించలేదని బీఆర్ఎస్ చెబుతోంది. ఇప్పటికే నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై బీఆర్ఎస్ ఎంపీలు నిరసన తెలిపారు. ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసిన ఎంపీలు, కేఆర్ఎంబీ తీసుకునే నిర్ణయాల వల్ల రాష్ట్రానికి కలిగే నష్టాల గురించి వివరించారు. ప్రాజెక్టుల అప్పగింతపై తమకున్న అభ్యంతరాలను తెలుపుతూ లేఖను అందజేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ పూర్తయ్యేవరకు ఇరు రాష్ట్రాలకు 50:50 పద్ధతిలో నీటి కేటాయింపులు ఉండేలా చూడాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కృష్ణా జలాల్లో జరుగుతున్న అన్యాయంపై 2003 ఆగస్టు 26న కోదాడ నుండి కేసీఆర్ పాదయాత్ర చేపట్టారు. నాలుగు రోజులపాటు సాగిన పాదయాత్ర హాలియాలో బహిరంగ సభతో ముగిసింది. 2004లో ఫ్లోరైడ్‌పై అధ్యయన కోసం కేసీఆర్ రెండ్రోజుల బస్సు యాత్ర చేపట్టారు. మర్రిగూడ, నాంపల్లి, చండూర్, నార్కట్‌పల్లి మండలాల్లో పర్యటించి ఫ్లోరైడ్ బాధితులతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సమయంలోనే గుండె నిండా ఫ్లోరైడ్ బండా? తల్లడిల్లే నల్లగొండ అంటూ స్వ-యంగా కేసీఆర్ పాట రచన చేశారు. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ కృష్ణా జలాల్లో వాటా కోసం మ-రోసారి పోరాటానికి సన్నద్ధమవుతోంది.

# రేషన్‌కార్డు గ్యారంటీ!

మొదటిపేజీ తరువాయి..

అందిస్తోంది. 2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఒకటి. ఈ పథకం ద్వారా ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ. 13,910 కోట్లు భారం పడే అవకాశం ఉంది. అయితే ఈ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందేందుకు ఎవరు అర్హులని సందేహాలు వస్తున్నాయి. రేషన్ కార్డు ఉన్నవారికే ఈ ఉచిత విద్యుత్ పథకానికి అర్హులుగా ప్రకటించారు. అయితే కిరాయి ఉండేవారికి ఎలా ఉచిత విద్యుత్ అందిస్తారానేది ప్రశ్నగా మారింది. ఈ ఉచిత విద్యుత్ పాటు త్వరలో రూ. 500 గ్యాస్ సిలిండర్ ఇచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత మహిళలకు రూ. 2500 ఆర్థిక సాయం పథకాన్ని కూడా ప్రారంభించే అవకాశం ఉంది. దీంతో పాటు కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

# మంచిరేవులలో తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

**రంగారెడ్డి, ప్రభాతసూర్యుడు :** రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమయింది. భవాని ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా తన ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. భర్త మహేష్ భార్య, పిల్లల ఆచూకీ కోసం తీవ్రంగా గాలించాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో హుటాహుటిన నార్సింగీ పోలీసులను ఆశ్రయించాడు. నార్సింగీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సిసిటీవీ ఫూటేజ్ ను పరిశీలించారు. గత మూడు రోజుల క్రితం భవానీ పై ఒక దుండగుడు దాడి చేసాడు. ముఖానికి మాస్క్ ధరించి ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసి పారిపోయాడు. ఆ దిశగా కేసు దర్యాప్తు నార్సింగీ పోలీసులు చేస్తున్నారు. దాడి చేసిన దుండగుడు ఎవరు? భవానీని ఎందుకు దాడి చేసాడు? భవానీ ఇంట్లో నుండి ఎందుకు వెళ్లిపోవాల్సి వచ్చిందని విచారిస్తున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మాకో టిక్కెట్ కావాలి..

## గాంధీభవన్‌కు కాంగ్రెస్ నేతలు, ఆశావహులు క్యూ



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకూ సమాయత్తం అవుతోంది. ఇప్పటికే ఇన్‌చార్జీలను నియమించి క్షేత్రస్థాయిలో పార్టీ బలాబలాలను అంచనా వేస్తోంది. క్యాడర్‌ను సమాయత్తం చేస్తోంది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దరఖాస్తుల విధానం విజయవంతం కావడంతో లోక్‌సభ ఎన్నికల కోసం కూడా అదే విధానం అవలంబిస్తున్నారు. ఈ క్రమంలో పోటీ చేయాలనుకునేవారు రూ.50 వేలు చెల్లించి దరఖాస్తు అందించాలని సూచించారు.కాంగ్రెస్ లోక్‌సభ టికెట్ల కోసం తీసుకుంటున్న దరఖాస్తులకు భారీగా స్పందన వస్తోంది. నేతలు క్యూ కడుతున్నారు. ఇందులో ఇద్దరు తెలుగు సినీ నిర్మాతలు కూడా ఉండడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. నిర్మాత, నటుడు అయిన బండ్ల గణేశ్ మల్కాజ్‌గిరి స్థానం నుంచి పోటీ చేసేందుకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నాడు. మరో నిర్మాత దిల్ రాజు కూడా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఆయన నిజామాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. నిర్మాతల మండలి ఎన్నికల సమయంలోనే ఆయన హింట్ ఇచ్చారు. ఈ క్రమంలో ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో తన అదృష్టం పరీక్షించుకోవాలని చూస్తున్నారు.నిజామాబాద్ జిల్లా దిల్‌రాజు సొంత జిల్లా. అక్కడి నుంచే పోటీకి దిగే అవకాశం ఉంది. అందుకే ఆయన మాపల్లె చారిటబుల్ ట్రస్ట్ ద్వారా స్వగ్రామం నర్సింగ్‌పల్లితోపాటు నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత కూడా దరఖాస్తు చేసుకుందిప్రస్తుత వస్తున్న దరఖాస్తుల సరళిని పరిశీలిస్తే ఖమ్మం స్థానానికి ఎక్కువ పోటీ కనిపిస్తోంది. అగ్రనేతలు ఇక్కడి నుంచి పోటీకి యత్నిస్తున్నారు. మాజీ ఎంపీ రేణుకాచౌదరి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీ వీ. హనుమంతరావు, రాజేంద్రప్రసాద్ ఖమ్మం టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ నుంచి సోనియా గాంధీ పోటీ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతోంది.

## రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

రాజన్నసిరిసిల్ల, ప్రభాతసూర్యుడు : సోమవారం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లో బారులు తీరారు. భక్తుల రద్దీ దృష్ట్యా గర్భాలయంలో భక్తులచే నిర్వహించే ఆర్జిత సేవలను ఆలయ అధికారులు రద్దు చేసారు. భక్తులకు లఘు దర్శనానికి అనుమతి నిచ్చారు. స్వామివారి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది.

# లక్సెట్టిపేటలో బలం నిరూపించుకున్న గులాబీ




ఆదిలాబాద్, ప్రభాతసూర్యుడు : మంచిర్యాల జిల్లాలో లక్షెట్టిపేట మున్సిపాలిటీని తమ చేతుల్లోంచి జారిపోకుండా ఎట్టకేలకు కాపాడుకోగలిగింది బీఆర్‌ఎస్. లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులుండగా.. 9 మంది కాంగ్రెస్ కౌన్సిలర్ల బలంతో చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్‌లపై అవిశ్వాసానికి గత నెల 12న నోటీసులు ఇవ్వగా.. ఫిబ్రవరి 3న బల నిరూపణకు అవకాశం ఇచ్చారు జిల్లా కలెక్టర్. ఆయన ఆదేశాలతో ప్రత్యేక అధికారి మంచిర్యాల ఆర్డీవో రాములు ఆధ్వర్యంలో బల నిరూపణ సమావేశం జరిగింది. ఉదయం 11 గంటలకు చైర్మన్‌పై అవిశ్వాస బలనిరూపణ, మధ్యాహ్నం 12.30 గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస బలనిరూపణకు అవకాశం ఉండగా.. కోరం సభ్యులు ఎవరు హాజరు కాకపోవడంతో ప్రొసిడింగ్ అధికారి రాములు సమావేశాన్ని 3:30 గంటలకు మార్చారు. అయినప్పటికి కోరం సభ్యులు ఎవరు హాజరుకాకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్టుగా తేల్చారు. దీంతో ఎట్టకేలకు మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట ఒక్క మున్సిపాలిటీనైనా హస్తం గూటికి చేరకుండా కాపాడుకోగలిగింది బీఆర్‌ఎస్ పార్టీ.గత నెల మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి మున్సిపాలిటీతో మొదలైన అవిశ్వాసల పర్వం.. నేటి లక్షెట్టిపేట మున్సిపాలిటీ అవిశ్వాసంతో తారస్థాయికి చేరింది. మంచిర్యాల జిల్లాలో ఆరు మున్సిపాలిటీలుండగా.. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ఆరుకు ఆరు స్థానాలు కారు పార్టీ కైవసం చేసుకుంది. మొత్తం 150 వార్డులకు గానూ 100 మంది కౌన్సిలర్లను గెలిపించుకుని విజయఢంకా మోగించింది అప్పటి టీఆర్‌ఎస్. కానీ సడన్‌గా అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోవడంతో కారు పార్టీ కథ మంచిర్యాల జిల్లాలో అడ్డం తిరిగింది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై ఏకంగా సొంత పార్టీ కౌన్సిలర్లే అవిశ్వాస నోటీసులివ్వడం చైర్మన్ల తీరును వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి కౌన్సిలర్లు గంపగుత్తగా కాంగ్రెస్ గూటికి చేరిపోవడటంతో బీఆర్‌ఎస్ పార్టీ ఒక్కసారిగా అదమ పాతాళానికి పడినంత పనైంది.ఇప్పటికే మంచిర్యాల, బెల్లంపల్లి, నస్పూర్ మున్సిపాలిటీలలో అవిశ్వాసంలో కాంగ్రెస్ నెగ్గగా.. క్యాతన్‌పల్లిలో కేవలం ఒక్కరంటే ఒక్కరినే గెలిపించుకున్న కాంగ్రెస్.. మారిన రాజకీయ పరిణామాలతో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరిన చైర్మన్, వైస్ చైర్మన్లతో 10కి బలాన్ని పెంచుకుంది. ఈ మున్సిపాలిటీలో ఫిబ్రవరి 6న బలనిరూపణ జరగనుండగా.. అంతకంటే ముందే శనివారం జరిగిన లక్షెట్టిపేట మున్సిపాలిటీలో అవిశ్వాసాన్ని వీగిపోయేలా పావులు కదిపి సత్తాచాటింది బీఆర్‌ఎస్.లక్షెట్టిపేట మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిలర్లు మొత్తం 15 వార్డులకు ఉండగా.. 5 కాంగ్రెస్, 9 బీఆర్‌ఎస్, ఒక స్వతంత్ర్య అభ్యర్థి అప్పటి ఎన్నికల్లో విజయం సాధించగా.. మారిన రాజకీయ పరిణామాలతో స్వతంత్ర్య అభ్యర్థితో పాటు బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్ బలం తొమ్మిదికి చేరింది. అయితే అవిశ్వాసానికి 2/3 అంటే పది మంది కౌన్సిలర్ల బలం అవసరం కాగా.. ఓరుగంటి శ్రీకాంత్ అనే బీఆర్‌ఎస్ కౌన్సిలర్ సైతం సొంత పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం కోరుతూ సంతకం చేసి.. అంతలోనే యూ-టర్న్ తీసుకోవడంతో కాంగ్రెస్ ఇరకాటంలో పడింది. శనివారం జరిగిన అవిశ్వాస బలనిరూపణలో బలం లేకపోవడంతో కాంగ్రెస్ అవిశ్వాసానికి దూరంగా ఉండిపోయింది. దీంతో 20 రోజుల ముందే తమ కౌన్సిలర్లను క్యాంపునకు తరలించిన బీఆర్‌ఎస్.. ఎట్టకేలకు అవిశ్వాసం వీగిపోవడంతో ఊపిరి పీల్చుకుంది. అయితే కాంగ్రెస్ మాత్రం అంత ఈజీగా ఈ మున్సిపాలిటీని వదులుకునే ఛాన్సే లేదని.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామంటోంది.




# ఖానాపూర్‌లో 'కారు' బ్రేక్‌డౌన్!

- మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం
- చైర్మన్ పీఠం కాంగ్రెస్ వశం?

నిర్మల్, ప్రభాతసూర్యుడు : జిల్లాలోని ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో చేరింది. బీఆర్‌ఎస్ చైర్మన్ రాజేందర్‌పై కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం అయింది. ఖానాపూర్ మున్సిపాలిటీలో నేడు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి చైర్మన్, వైస్ చైర్మన్లపై బల నిరూపణ పరీక్ష నిర్వహించారు. ఆర్డీవో రత్నకుమారి ఆధ్వర్యంలో ఈ బలనిరూపణ పరీక్ష జరిగింది. ఈ బలనిరూపణ పరీక్షలో మొత్తం 12 మంది కౌన్సిలర్లలో బీఆర్‌ఎస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా 9 మంది కౌన్సిలర్లు ఓటేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్మన్ రాజేందర్, వైస్ చైర్మన్ ఖలీల్‌కు వ్యతిరేకంగా 9 మంది బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు ఒకటయ్యారు. దీంతో ఖానాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశమైంది.

# విశాఖలో భారత్ ఘన విజయం

- రెండో టెస్ట్‌లో రాణించిన టీమిండియా బౌలర్లు
- ఫలించని క్రాలే ఒంటరి పోరాటం
- 106 పరుగుల తేడాతో ఇంగ్లాండుపై గెలుపు
- చెరో 3 వికెట్లతో సత్తా చాటిన అశ్విన్, బుమ్రా



స్పోర్ట్స్ బ్యూరో, ప్రభాతసూర్యుడు : వైజాగ్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 292 పరుగులకు ఆలౌట్ చేసి 106 పరుగుల తేడాతో గెలుపొందింది. రెండో ఇన్నింగ్స్‌లో క్రాలే పోరాడినా మిగిలిన బ్యాటర్లు అనుకున్నంత మేర రాణించలేకపోయారు. బౌలర్లు సమష్టిగా రాణించడంతో టీమిండియా ఘన విజయం సాధించింది. అశ్విన్ 3, బుమ్రా 3 వికెట్లతో సత్తా చాటారు.

**విజయం సాధించిందిలా..**

ఓ వర్నైట్ స్కోరు ఒక్క వికెట్ నష్టానికి 67 పరుగులతో నాలుగో రోజు ఆట ప్రారంభించింది. క్రాలే మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 73 పరుగులు చేసిన క్రాలేను కుల్‌దీప్ అవుట్ చేశాడు. ఎల్బీ కోసం టీమిండియా అప్పీలు చేయగా.. అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. డీఆర్‌ఎస్ తీసుకున్న భారత్‌కు ఫలితం సానుకూలంగా వచ్చింది. దీంతో 194 పరుగుల వద్ద ఇంగ్లాండ్ ఐదో వికెట్‌ను నష్టపోయింది. వెంటనే ఇంగ్లాండ్‌కు మరో షాక్ తగిలింది. బుమ్రా బౌలింగ్‌లో బెయిర్ స్టో ఎల్బీగా ఔట్ అయ్యాడు. అంపైర్ ఔట్ ఇవ్వడంతో ఇంగ్లాండ్ డీఆర్‌ఎస్ తీసుకుంది. సమీక్షలోనూ 'అంపైర్స్ కాల్' రావడంతో బెయిర్‌స్టో నిరాశగా పెవిలియన్‌కు చేరాడు. తొలి మ్యాచ్‌లో సెంచరీతో కదంతొక్కిన ఓలీ పోప్ క్యాచ్‌ను స్లిప్‌లో రోహిత్ శర్మ అద్భుతంగా అందుకున్నాడు. అశ్విన్ బౌలింగ్‌లో 23 పరుగులు చేసిన ఓలీ పోప్ ఔటయ్యాడు. అనంతరం బెన్ ఫోక్స్, హార్ట్‌లీ పోరాడారు. టీమిండియా బౌలర్లలో అశ్విన్ రాణించాడు. చరిత్ర సృష్టించిన క్రికెట్ జీనియస్ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచులో టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ రికార్డు సృష్టించాడు. ఇంగ్లాండ్ పై టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అశ్విన్ కొత్త చరిత్ర లిఖించాడు. ఇప్పటి వరకు ఈ ఘనత చంద్రశేఖర్ పేరిట ఉంది. చంద్రశేఖర్ 38 ఇన్నింగ్స్‌ల్లో 95 వికెట్లు పడగొట్టగా ఈ రికార్డును అశ్విన్ బద్దలుకొట్టాడు. అశ్విన్ 38 ఇన్నింగ్స్‌ల్లో 96 వికెట్లతో ఆ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. వీరిద్దరి తరువాత మూడో స్థానంలో అనిల్ కుంబ్లే 92 వికెట్లతో ఉన్నాడు. ఇంగ్లాండ్ జట్టుపై ఇప్పటి వరకు ఏ టీమ్‌ఇండియా బౌలర్ కూడా వంద వికెట్లు తీయలేదు. అశ్విన్ ఇప్పటి వరకు ఇంగ్లాండ్ పై 97 వికెట్లు తీశాడు. అతడు మరో 3 వికెట్లు గనుక తీస్తే ఇంగ్లాండ్ పై వంద వికెట్లు తీసిన మొదటి భారత బౌలర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఇక రెండు జట్ల మధ్య అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా జేమ్స్ అండర్సన్ ఉన్నాడు. 66 ఇన్నింగ్స్‌ల్లో 139 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచులో అశ్విన్ మరో మూడు వికెట్లు తీస్తే.. టెస్టుల్లో 500 వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టిస్తాడు. ఈ మైలురాయిని చేరుకున్న తొమ్మిదో ఆటగాడిగా రికార్డుల్లోకి ఎక్కనున్నాడు. ప్రస్తుతం అశ్విన్ 96 టెస్టుల్లో 497 వికెట్లు తీశాడు. ఇందులో 5 వికెట్లు ప్రదర్శన 34 సార్లు నమోదు చేశాడు. యశస్వీ పేరిట రికార్డులే రికార్డులువైజాగ్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ అద్భుత ఆటతీరుతో అపద్బాంధువుడి పాత్ర పోషించాడు. అవతలి బ్యాటర్లు అర్థ శతకం చేసేందుకే కష్టాలు పడుతున్న వేళ... అజేయ ద్వి శతకంతో టీమిండియాకు భారీ స్కోరు అందించాడు. 290 బంతులు ఎదుర్కొన్న జైస్వాల్...19 ఫోర్లు, 7 సిక్సులతో 209 పరుగులు చేసి అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌లో సిక్సర్‌తో సెంచరీ మార్క్ అందుకున్న జైస్వాల్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో గిల్ సెంచరీతో కదం తొక్కాడు.

# హాస్టల్లో అసలేం జరిగింది?



మొదటిపేజీ తరువాయి..

మండిపడ్డారు. సూసైడ్ నోట్ పైనా వారు అనుమానాలు వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ హాస్టల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా.. పోలీసులు అక్కడకు వెళ్లి ఆందోళనకారులకు సద్దిచెప్పారు. మరోవైపు, ఈ కేసులో వార్డెన్ శైలజతో పాటు వంట మనుషులు, పీఈటీ, ట్యూషన్ టీచర్, ఓ ఆటో డ్రైవర్ పై పోలీసులు కేసు నమోదు చేసి వారిని విచారిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం రాత్రి ఇద్దరు పదో తరగతి విద్యార్థినులు హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. హైదరాబాద్ లోని హబ్సిగూడకు చెందిన భవ్య (15), వైష్ణవి (15) హాస్టల్ లో ఉంటూ పట్టణంలోని రెడ్డివాడ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రోజూ మాదిరిగానే శనివారం స్కూలుకు వెళ్లిన విద్యార్థినులు సాయంత్రం హాస్టల్‌కు వచ్చారు. తర్వాత వసతి గృహంలో నిర్వహించే ట్యూషన్‌కు హాజరు కాలేదు. టీచర్ పిలిచినా.. తాము రాత్రి భోజనం చేసి వస్తామని చెప్పి గదిలోనే ఉండిపోయారు. భోజనానికి కూడా రాకపోవడంతో ఓ విద్యార్థిని వారి గది వద్దకు వెళ్లి చూడగా.. ఇద్దరు విద్యార్థినులు రెండు ఫ్యాన్లకు ఉరి వేసుకుని కనిపించారు. ఈ విషయాన్ని సిబ్బందికి తెలియజేయగా.. వారు వెంటనే అంబులెన్సును రప్పించి ఇద్దరినీ జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. విద్యార్థినులను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. సంఘటనా స్థలంలో ఓ సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. స్నేహితులైన ఇద్దరు బాలికలు తమను వేధింపులకు గురి చేశారంటూ కొందరు 7వ తరగతి విద్యార్థినులు పీఈటీకి ఫిర్యాదు చేశారు. ఆమె వసతి గృహం వార్డెన్ శైలజకు సమాచారం ఇవ్వగా.. ఆమె ఇద్దరినీ పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ విషయాన్ని బాలికల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో తమపై ఫిర్యాదు చేశారనే మనస్తాపంతో, అవమానంగా భావించిన ఇద్దరు బాలికలు ఆత్మహత్యకు పాల్పడ్డారనిపోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఘటనా స్థలంలో పోలీసులకు ఓ సూసైడ్ నోట్ లభ్యమైంది. 'మేము వెళ్లిపోతున్నందుకు అందరూ మమ్మల్ని క్షమించండి. మేం తప్పు చేయకపోయినా అందరూ మమ్మల్ని మాటలు అంటుంటే వాటిని తీసుకోలేకపోతున్నాం. మమ్మల్ని శైలజ మేడం తప్ప ఎవ్వరూ నమ్మడం లేదు. మా బాధ ఎవరికీ చెప్పుకోలేక ఇలా వెళ్లిపోతున్నాం. మా ఇద్దరినీ ఒకే చోట సమాధి చెయ్యండి.' అని సూసైడ్ నోట్ లో రాసి ఉంది. అయితే, తమ పిల్లలది ఆత్మహత్య కాదని.. హత్య అని విచారించి తమకు న్యాయం చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.

# కేసీఆర్‌పై సీబీఐ

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ నాయకుడు నిరంజన్‌రెడ్డి పిల్ వేశారు. అయితే ఇప్పటికే వివరాలు సమర్పించాలని ప్రభుత్వం గత ప్రభుత్వాన్నే ఆదేశించింది. అయితే కొంత సమయం కావాలని అడ్వకేట్ జనరల్ కోరారు. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కొత్త కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తాజాగా మేడి గడ్డ కుంగుబాటుపై మరోమారు హైకోర్టు విచారణ జరిపింది. నివేదిక ఏమైందని ప్రభుత్వాన్ని అడిగింది. ఏం చేద్దామని ప్రశ్నించింది. మళ్లీ రెండు వారాల గడువు ఇచ్చింది. మరోవైపు విచారణకు తాము సిద్ధమని ఇప్పటికే సీబీఐ హైకోర్టుకు తెలిపింది.ఇప్పుడు అందరి దృష్టి కాంగ్రెస్ సర్కార్‌పై పడింది. ఇప్పటికే విజిలెన్స్ విచారణ చేపించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కోరింది. ఈమేరకు విజిలెన్స్ నివేదిక సిద్ధం చేస్తోంది. అసెంబ్లీ సమావేశాల్లోగా ఈ నివేదిక ప్రభుత్వానికి అందించే అవకాశం ఉంది. ఇందులో మేడిగడ్డలోనే రూ.3,200 కోట్ల అవినీతి జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో కోర్టు నివేదిక కావాలని కోరడంతో ఇప్పుడ రాష్ట్ర ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి నెలకొంది. సీబీఐ విచారణకు ఓకే చెబుతుందా.. లేక కేసీఆర్‌తో లాలూచీ పడి వెనుకడుగు వేస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అంగీకరిస్తే సీబీఐ రంగంలోకి దిగుతుంది.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## అయోధ్యలో ఉచిత అల్పహారం, అన్న ప్రసాదం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : అయోధ్యలోని రామా మందిరం అనుమాన్ గడ్ వద్ద హైద్రాబాద్, ఉస్మాన్ గంజ్ కు చెందిన భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యం లో ఈనెల 20నుండి మార్చ్ 2వ తేదీ వరకు ప్రతిరోజూ 30వేల మంది రామా భక్తు లకు ఉచితంగా అల్పాహారం,అన్నప్రసాదం, మంచినీటి సేవా కార్యక్రమాలను అందిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ తెలిపారు. అబిడ్స్, బొగ్గుల కుంటలోని,తెలంగాణ సరస్వతీ పరిషత్తు ఆడిటోరియంలో అన్నదాన బ్రోచర్,అన్నప్రసాదా వెబ్సైట్ లను విహెచ్పి రాష్ట్ర నాయకులు యాదిరెడ్డి,బుచ్చిరెడ్డిలు ప్రారంభించారు.దేశం నలుములల నుండి అయోధ్య బాలరాముని చూడడానికి లక్షలాదిగా తరలి వస్తున్న భక్తులకు బాస్ తమవంతు సహాయంగా అన్నదానం చేయడానికి ముందుకు రావడం సంతోషకరమని యాదిరెడ్డి,బుచ్చిరెడ్డి తెలిపారు.

# సంపాదకీయమ్..

## పౌర చట్టమే పరిష్కారం

మోడీ హయాంలో ఎవరూ సాధించలేం అనుకున్నవి సాధించారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అవుతుందని ఎవరూ అనుకోలేదు. ట్రిపుల్ తలాక్ రద్దును ఎవరూ ఊహించలేదు. రామమందిరం సఫలీకృతం అవుతుందని ఎవరూ ఊహించలేదు. ఈ దేశంలో ఇవి జరగవు అన్న నిరాశలో ఉన్న జనానికి మోడీ నేను ఉన్నానని సాధించి నిరూపించారు. చట్టసభల్లో 3వ వంతు రిజర్వేషన్లను కూడా మోడీ సాధించారు.మరి ఇన్ని సాధించిన మోడీకి ఇంపార్టెంట్ 'యూసీసీ'పై పడ్డారు. అందరికీ ఒకే పౌరసత్వం అనేది ఇప్పుడు బీజేపీ ముందున్న అతిపెద్ద సవాల్. కులం, మతం ప్రాతిపదికన విభజించిన ఈ దేశంలో ఇదే అతిపెద్ద సవాల్ గా ఉంది. పెద్ద ఉదారవాదులంతా యూసీసీని వ్యతిరేకిస్తున్నారు. యూసీసీని అమలు చేసే అవకాశాలు మెండుగా వచ్చాయి.ప్రయోగాత్మకంగా ముందు ఉత్తరాఖండ్ లో అమలు చేయబోతున్నారు. శుక్రవారం ఫిబ్రవరి 2న ఐదుగురితో కమిటీ ప్రభుత్వానికి తన నివేదిక ఇచ్చింది. కేబినెట్ సమావేశంలో దీన్ని ఆమోదించబోతున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 5 నుంచి 8 మధ్య అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి బిల్లు ఆమోదించనున్నారు.2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫార్మ్ సివిల్ కోడ్) వ్యవహారం మళ్లీ ఊపందుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు అనేక మంది బీజేపీ నేతలు యూసీసీ కోసం ప్రచారాలు చేస్తున్నారు. ఇండియాలో యూనిఫార్మ్ క్రిమినల్ కోడ్ ఇప్పటికే అమల్లో ఉంది. అంటే.. నేరానికి పాల్పడే వారికి మతం, సమాజం వంటి అంశాలతో సంబంధం లేకుండా శిక్షలు అమలవుతున్నాయి. ఉమ్మడి పౌర స్మృతి కూడా ఒకరకంగా ఇలాంటిదే! కానీ చాలా క్లిష్టమైన విషయం. ప్రజల వ్యక్తిగత వ్యవహారాలైన పెళ్లి, విడాకులు, ఆస్థి పంపకాలు, దత్తత వంటి అంశాల్లో మతానికి సంబంధం లేకుండా ఒకే విధమైన చట్టాన్ని తీసుకురావడమే యూనిఫార్మ్ సివిల్ కోడ్. ఇండియాలో ప్రస్తుతం మతం ఆధారంగా వ్యక్తిగత చట్టాలు అమల్లో ఉన్నాయి. వాటన్నింటినీ తొలగించి, వాటి స్థానంలో ఒకే ఒక్క చట్టాన్ని తీసుకురావడం ఈ యూసీసీ.రాజ్యాంగాన్ని రచించిన వారు ఆర్టికల్ 44లో ఈ ఉమ్మడి పౌర స్మృతిని ప్రస్తావించారు. దేశ ప్రజల ఉమ్మడి పౌర స్మృతి కోసం ప్రభుత్వం ప్రయత్నించాలని పేర్కొన్నారు.

అయితే.. ఈ అంశంలో ఉన్న సున్నితత్వాన్ని గ్రహించిన రాజ్యాంగ రూపకర్తలు.. యూసీసీని అమలు చేసే విషయంలో ప్రభుత్వానికే స్వేచ్ఛనిచ్చారు. వాస్తవానికి ఈ యూనిఫార్మ్ సివిల్ కోడ్‌పై ప్రభుత్వాలు మాట్లాడటం ఇది కొత్త విషయం ఏం కాదు. బీజేపీ కన్నా ముందే.. కేంద్రంలోని చాలా ప్రభుత్వాలు చాలాసార్లు ఈ ఉమ్మడి పౌర స్మృతిపై చర్చలు జరిపాయి. కానీ ఇప్పటివరకు యూసీసీ కార్యరూపం దాల్చలేదు. ఎందుకంటే.. యూసీసీని అమలు చేయడం చాలా కష్టమనే చెప్పుకోవాలి. ఎన్నో మతాలు, విభిన్న ఆచారాలు, సాంప్రదాయాలు, భిన్నత్వాలకు నెలవు భారత దేశం. ఇక్కడ చాలా వరకు అంశాలు మతాలు, ఆచార వ్యవహారాలతో ముడిపడి ఉంటాయి. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులకు వేరువేరుగా చట్టాలు ఉన్నాయి. పెళ్లి నుంచి విడాకుల వరకు, ఆస్థి పంపకం నుంచి డబ్బు విషయం వరకు అన్నింటికీ వేర-ువేరు చట్టాలు ఉన్నాయి. అలాంటి భారత దేశంలో యూసీసీని అమలు చేయాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇండియాకు యూసీసీ అవసరం ఉందని, దానికి మద్దతిచే వారు చెబుతుంటారు. ఉమ్మడి పౌర స్మృతితో లింగ సమానత్వం ఏర్పడుతుందని, మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు మెరుగుపడతాయని అంటున్నారు.

ఇది నిజమే. ఉమ్మడి స్మృతితో సమాన హక్కులు లభిస్తాయి. మహిళలకు వ్యతిరేకంగా ఉన్న కొన్ని సున్నితమైన, వివాదాస్పదమైన అంశాలను సైతం తొలగించవచ్చు. మరోవైపు యూనిఫార్మ్ సివిల్ కోడ్‌తో దేశం మొత్తం ఒక్కటవుతుందని, ఐకమత్యంతో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని, ప్రజల్లో లౌకికవాదం పెంపొందుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.యూసీసీని అమలు చేయడమే అతిపెద్ద ప్రతికూల విషయం అని విమర్శలు అంటుంటారు. భిన్న మతాలు, ఆచారాలకు నిలవు అయిన ఇండియాలో యూసీసీ వంటి చట్టాల అమలు అసాధ్యమని, ఒక వేళ అమలు చేసినా.. ప్రజల మత స్వేచ్ఛపై భారీ ప్రభావం పడుతుందన్నది విమర్శకుల వాదన.మరోవైపు ఉమ్మడి పౌర స్మృతితో మైనారిటీలపై అధిక ప్రతికూల ప్రభావం పడుతుందని విమర్శలు అంటున్నారు. ఇప్పుడున్న వ్యక్తిగత చట్టాలు.. మతాల అనుగూణంగా ఉన్నాయని, వాటినే ప్రజలు అమలు చేస్తున్నారని చెబుతున్నారు. వీటి స్థానంలో యూసీసీని తీసుకొస్తే.. మైనారిటీలకు ఉన్న ప్రత్యేక హక్కులు బలహీనపడే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. వీటిని పరిగణలోకి తీసుకుని యూనిఫార్మ్ సివిల్ కోడ్‌ను రూపొందించినా.. క్షేత్రస్థాయిలో అమలుచేయడం కష్టమని స్పష్టం చేస్తున్నారు. దేశంలోని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ యూసీసీని వాడుకోవడం దురదృష్టకరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తమతమ నియోజకవర్గాల్లో ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు, తరచుగా ఈ యూనిఫార్మ్ సివిల్ కోడ్ అంశాన్ని లేవనెత్తి, ఈ ప్రయోజనాలుంటాయి.. ఆ ప్రయోజనాలంటూయని వారికి చెబుతున్నారని అంటున్నారు.ఇలా ప్రతిసారి రాజకీయాలు అడ్డుపడుతుండటంతో.. ఉమ్మడి పౌర స్మృతిపై అసలైన, అవసరమైన చర్చలు తగ్గిపోతున్నాయన్నది విశ్లేషకుల మాట. ఫలితంగా యూసీసీలోని సానుకూల, ప్రతికూల అంశాలపై చర్చలు జరగటం లేదన్నది వారి అభిప్రాయం.

## కలిసిరానున్న కొలువులు!

- గ్రూప్ -1 పోస్టులు పెంపునకు సర్కారు యోచన
- అదనంగా 70 ఖాళీలను కలిపేందుకు కసరత్తు

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో గ్రూప్–1 పోస్టులను పెంచేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు తెలిసింది. గతంలోని 503 ఖాళీలకు అదనంగా మరో 70కి పైగా పోస్టులను చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో మొత్తం ఖాళీల సంఖ్య 600 వరకూ ఉండే అవకాశం ఉంది. ఈ ఏడాది చివరి వరకు మరో 130 పోస్టులు ఖాళీ అవుతాయని అధికారులు తేల్చారు. ఇప్పటికే ఆయా శాఖలు ఖాళీల వివరాలను ఆర్థికశాఖకు సమర్పించినట్లు సమాచారం. ఖాళీ పోస్టులకు మాత్రమే భర్తీ ప్రక్రియ చేపట్టాలా త్వరలో ఖాళీ అయ్యే పోస్టులకు కూడా నోటిఫికేషన్ ఇవ్వాలా అనే అంశంపై కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోను న్నారు. గతంలో గుర్తించిన 503 గ్రూప్ –1 పోస్టులకు అదనంగా ఇంకా ఏమైన ఖాళీలు ఏర్పడితే ఆ వివరాలు ఇవ్వాలని అన్ని శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులు, ఏడాది చివరిలో ఖాళీ అయ్యే పోస్టుల వివరాలు విడివిడిగా ఇవ్వాలని సూచించింది. పెంచిన పోస్టులను ఎలా భర్తీ చేయాలనే అంశంపై కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

## పాటల పల్లకీలో ఊరేగిన చిరుగాలి..



- గాన సరస్వతీగా లతామంగేష్కర్ కీర్తి
- 30 వేల పాటలు పాడిన ఏకైక గాయనిగా గిన్నీస్ రికార్డు
- అత్యుత్తమ పురస్కారాలు అందుకున్న అరుదైన గాయకురాలు

**నేడు ఆమె వర్ధంతి**

ఆమె పాడితే చాలు కళాభిమానుల గుండెలు పరవళ్లు తొక్కుతాయి... ఆమె గానామృతం యావత్ భారతీయ సినీరంగాన్నే ఉర్రూతలూగించింది. భారతీయ సినిమా చరిత్రలో ఆమె పాడిన ప్రతీ పాటదీ ఒక ప్రత్యేకత. ఆమె జీవితం ఎందరో భావి గాయక, గాయనీమణులకు ఆదర్శం. ఆమె పేరే "లతా మంగేష్కర్". భారతకోకిలగా, గాన సరస్వతిగా అభిమానులు ముద్దుగా పిలుచుకొనే ఆ మేటి గాయని అందర్ని వదిలి 2022 ఫిబ్రవరి 6 న 92 వయస్సు లో దివికేగింది.1929 సెప్టెంబరు 28 తేదీన సుప్రసిద్ధ సంగీతకారుడు దీనానాథ్ మంగేష్కర్‌కు పెద్ద కుమార్తెగా జన్మించిన లతా అయిదవ ఏటనే సంగీతంపై మక్కువను పెంచుకున్నారు. కె.ఎల్ సైగల్ పాటలకుఆమె వీరాభిమాని. పదమూడేళ్ల వయసులో తండ్రి చనిపోయాక.. కుటుంబ పోషణ తన మీద పడడంతో లతా సినీ రంగంలోకి నటిగా, గాయనిగా ప్రవేశించాల్సి వచ్చింది.1942లో పహ్లే మంగళ్ గౌర్ అనే చిత్రంలో నటించి, పాటలు కూడా పాడారు. గులాం హైదర్ అనే సంగీత దర్శకుడు లతను తన కన్న బిడ్డగా భావించి, ప్రోత్సహం ఇవ్వడంతో ఆమె మంచి నేపథ్యగాయకురాలిగా పేరు తెచ్చుకుంది. తొలుత జీవన్ యాత్ర, మందిర్ లాంటి సినిమాల్లో పాటలుపాడినా, ఆ తర్వాత అల్బేలా, ఛత్రపతి శివాజీ, అనార్కలి వంటి హిట్ చిత్రాలు లత పాటలను ఎందరో అభిమానులకు చేరవేశాయి.

లతా నేపథ్య గాయకురాలిగా కొనసాగుతున్న కాలంలో ఖుర్షీద్, నూర్జహాన్ గాయనిలుగా వెలుగుందుతు న్నారు. దేశ విభజన సమయంలో వీరు పాకిస్థాన్ వెళ్లడం.. నేపథ్య సంగీతానికి ప్రాధాన్యత పెరగడం లతా మంగేష్కర్‌కు కలిసొచ్చింది. తర్వాత మంచి నేపథ్య గాయనిగా పేరు తెచ్చుకున్నారు. సినీ ప్రయా ణం ప్రారంభంలోనే లతా.. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. ఓ మరాఠి చిత్రం కోసం ఆమె పాడిన తొలి పాటను తొలగించారు. ఆ తర్వాత 'మజ్‌బూర్'లోని 'దిల్ మేరా తోడా' పాట పాడారు. ఇది విన్న వారంతా ఆమెను విమర్శించారు. దీనిని సవాలుగా తీసుకున్న ఈమె.. ఉర్దూలో సంగీత శిక్షణ తీసుకున్నారు.అనంతరం 'మహల్' సినిమాలోని ఆయేగా ఆయేగా పాటతో లతాజీ దశ తిరిగింది. వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా చేసింది.

భారత ప్రభుత్వం నుండి అన్ని అత్యుత్తమ పు-రస్కారాలు అందుకున్న అరుదైన గాయకురాలు లతా మంగేష్కర్. ప్రముఖ శాస్త్రీయ గాయకురాలు ఎం.ఎస్. సుబ్బలక్ష్మి తరువాత ఇటువంటి ఘనత సాధించిన విశిష్ట వ్యక్తి ఈమె ఒక్కరే కావటం గమానార్హం.ఈమె 1948 నుండి 1978 వరకు 30,000 పాటలు పాడిన ఏకైక గాయనిగా లత గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు సంపాదించారు . అలాగే గానకోకిల అనే బిరుదును సొంతం చేసుకున్నారు. ఈమె తెలుగులో సంతానం (నిదురపోరా తమ్ముడా, సుసర్ల దక్షిణామూర్తి), ఆఖరి పోరాటం (తెల్లచీరకు, ఇళయ రాజా) మొదలైన పాటలు పాడారు .టైం మేగజైన్ కవర్ పేజీ స్టోరీగా లతామంగేష్కర్ గురించి వ్యాసాన్ని ప్రచురించి ఆమెను "భారతీయ నేపథ్యగాయకుల రాణి" గా పేర్కొనడం విశేషం.లతాజీ నోట వినిపించని అందమైన రాగం లేదు. ఆమె పాటతో పరవశించని భారతీయ గీతాభిమాని లేడు. భజన-లైనా, భక్తి సంకీర్తనలైనా, దేశభక్తి గీతమైనా, ప్రేమ గానమైనా, విషాద రాగమైనా, వియోగ భరిత ఆలాపన అయినా.. లతాజీ పాడిందే పాట. ఆమె నోట వినిపించిందే పాట. అందుకే ఆమె ఇంటి ముంగిట వద్దకే అనేక అవార్డులు నడుచుకుంటూ వచ్చాయి. 1969లో పద్మభూషణ్, 1999లో పద్మవిభూషణ్, 2001లో భారతరత్న పురాస్కారాలతో భారత ప్రభుత్వం ఆమెను సత్కరించింది. ఎన్‌టీఆర్, ఏఎన్నార్, మహారాష్ట్ర భూషణ్ అవార్డులను దక్కించుకున్నారు. రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి కేంద్రం సన్మానించింది.

భారత ప్రభుత్వం నుండి అన్ని అత్యుత్తమ పు-రస్కారాలు అందుకున్న అరుదైన గాయకురాలు. ప్రముఖ శాస్త్రీయ గాయకురాలు ఎం.ఎస్. సుబ్బలక్ష్మి తరువాత ఇటువంటి ఘనత సాధించిన విశిష్ట వ్యక్తి ఈమె ఒక్కరే కావటం గమానార్హం.తన గళంతో ఎన్నో అద్భుతాలు సృష్టించి, కోట్లాది మంది అభిమానులను సంపాదించకున్న లతా మంగేష్కర్.. కె.ఎల్ సైగల్ పాటలకు వీరాభిమాని. 1962లో లతా మంగేష్కర్‌పై స్లో పాయిజన్‌ను ప్రయోగించారు. దీనివల్ల ఆమె దాదాపు 3 నెలల పాటు మంచం పట్టారు. ఆ విష ప్రయోగం చేసిందెవరో ఇప్పటికీ తేలలేదు. 2022 ఫిబ్రవరి 6న ముంబై బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో లతా మంగేష్కర్ కరోనా అనంతర ఆరోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ కన్నుమూసారు. చనిపోయేనాటికి ఆమె వయస్సు 92 సంవత్సరాలు.ఆమె జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం రెండు రోజులు 2022 ఫిబ్రవరి 6, 7 తేదీలు సంతాప దినాలను ప్రకటించింది.

## విపక్షాల తీరు విచిత్రం

- ప్రధాని మోదీ విమర్శలు
- ప్రతిపక్షాల్లో పోటీతత్వమే లేదని ఎద్దేవా
- త్వరలో కాంగ్రెస్ దుకాణానికి తాళమేనని జోస్యం
- పార్లమెంట్ బడ్జెట్ ప్రసంగంలో ప్రధాని భాష్యం



న్యూఢిల్లీ, ప్రభాతసూర్యుడు : బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రత్యేకంగా ప్రసంగించారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో సెనగోల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సంఘటనలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామన్నారు. విపక్షాల చర్యలు విచిత్రంగా ఉన్నాయని, సుదీర్ఘ కాలం విపక్షంలోనే ఉండాలని ఆ పార్టీలు భావిస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యాన్ని విపక్ష సభ్యులు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. విపక్షాలు ఎన్నికల్లో పోటీకి దూరంగా జరుగుతున్నాయని, పోటీ చేయాలనే సంకల్పమే లోపించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈసారి వాళ్లు రాజ్యసభకు వచ్చే ఆలోచనలో ఉన్నారని విసుర్లు విసిరారు. బీజేపీతో పోటీకి వణికిపోతున్నారని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై నరేంద్ర మోదీ సోమవారం సమాధానం ఇచ్చారు. దేశంలో నాలుగు వ్యవస్థలు పటిష్టంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ప్రధాని అన్నారు. తమ ప్రభుత్వంపై పదే పదే ఆరోపణలు చేయడమే విపక్షాలు పనిగా పెట్టుకున్నాయని. ఎన్నికల్లో ఓటమి కోసమే విపక్షాలు తీవ్రంగా కష్టపడుతున్నాయని అన్నారు. విపక్షాల దుస్థితికి కాంగ్రెస్సే కారణమని అన్నారు. మైనారిటీలంటూ ఎంతకాలం విభజన రాజకీయాలు చేస్తారని ప్రశ్నించారు. తోటి విపక్షాలను కాంగ్రెస్ ఎదగనీయలేదని, కాంగ్రెస్ తీరు దేశానికి, ప్రజాస్వామ్యానికి నష్టమని అన్నారు.ఈ ప్రభుత్వానికి ఇదే చివరి లోక్‌సభ సమావేశం కావడంతో.. తన స్పీచ్‌లో పొలిటికల్ స్పైసీని బాగానే దట్టించారు. మరోసారి విజయం తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తూనే.. విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. లోక్‌సభలో చివరి ప్రసంగం ఇచ్చిన ప్రధాని మోదీ.. విపక్షాలు చాలాకాలం ప్రజల మధ్యే ఉండాలని కోరుకుంటున్నాయని.. అందుకు విపక్షాలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు.దేశానికి చెందిన నాలుగు స్తంభాలను తన ప్రసంగంలో ఆమె ఫోకస్ చేశారన్నారు. పిల్లర్లు ఎంత దృఢంగా ఉంటే, దేశం అంత వేగంగా వృద్ధి సాధిస్తుందని రాష్ట్రపతి భావించినట్లు ప్రధాని వెల్లడించారు. దేశంలో విపక్షం బలహీనంగా ఉండటానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆయన అన్నారు. గడిచిన పదేళ్లలో బలమైన ప్రతిపక్షంగా మారేందుకు కాంగ్రెస్ పార్టీకి అవకాశం వచ్చిందని, కానీ వాళ్లు ఏమాత్రం ఎదగలేదని, అంతేకాదు ఇతర విపక్ష పార్టీలను కూడా ఎదగకుండా చేశారని ఆయన విమర్శించారు.

## రేవంత్ అబద్ధాల సీఎం



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : నీటి పారుదలశాఖలో అవకతవకలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలకు మాజీ మంత్రి హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ మీడియా సమావేశంలో హరీశ్ రావు చేసింది వితండవాదం తప్ప మరేమీ లేదని అన్నారు. కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని విమర్శించారు. సీఎం చెప్పినట్లుగాతాము పదవుల కోసం పెదవులు మూసుకోలేదని అన్నారు. పదవుల కోసం పెదవులు మూసుకున్నది రెవంత్ రెడ్డి, ఆయన మంత్రుల్లో ఇప్పుడు ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డే అని గుర్తు చేశారు. పోతిరెడ్డిపాడుకు కన్నం పెట్టి శ్రీశైలం నీరు ఆంధ్రా ప్రాంతానికి తరలించిన సమయంలో ఇచ్చిన జీవోకు తాము అందుకు వ్యతిరేకంగా అసెంబ్లీని స్తంభింపజేశామని అన్నారు. సోమవారం (ఫిబ్రవరి 5) హరీశ్ రావు ప్రెస్ మీట్ నిర్వహించారు.తాము మంత్రులుగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు జీవో వచ్చిందని సీం రేవంత్ రెడ్డి అన్నారని, అది తప్పని హరీశ్ రావు కొట్టిపారేశారు. తాము రాజీనామాలు చేసిన మూడు నెలలకు ఆ జీవో వచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణకు అన్యాయం చేస్తుంటే పదవులను గడ్డిపోచలుగా వదిలేశామని అన్నారు. పోతిరెడ్డిపాడు కోసం వైఎస్ 2005లో సెప్టెబరు 13న జీవో తెచ్చారని.. ఆ తర్వాత మూడు నెలలకు మరో జీవో ఇచ్చారని అన్నారు. తాము అదే ఏడాది జులైలోనే బయటకు వచ్చేశామని అన్నారు. ప్రాజెక్టులను అప్పగిస్తూ కేసీఆరే సంతకం చేశారని సీఎం చెప్పిన విషయాన్ని హరీశ్ రావు గుర్తు చేశారు. అసలు కేఆర్ఎంబీ సమావేశానికి కేసీఆర్ హాజరు కాలేదని అన్నారు. ఇంతకంటే అబద్ధాల ముఖ్యమంత్రి ఉంటారా అని అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పై కేసీఆర్ స్పందించలేదని సీఎం చెప్పారని.. రాయలసీమ ఎత్తిపోతలపై స్టే తీసుకొచ్చిందే బీఆర్ఎస్ కదా అని అన్నారు. సీఎం నోరు జారినా.. రెచ్చగొట్టినా మేం రెచ్చిపోబోమని అన్నారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడేందుకు తాము సిద్ధమని అన్నారు. తాము అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షమే అని అన్నారు. విషయం తెలియని వారే విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను చెప్పిన సమయానికి చెప్పినట్లుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215